క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్లు

సి.బెళగల్: మండల పరిధిలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాలను పట్టుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

19 నుంచి అల్లాబకాష్ మియా షరీఫ్ ఉరుసు

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని హజరత్ అల్లా బకాష్‌మియా షరీఫ్ ఉరుసు ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు దర్గా పూజారి ఎస్ఎండీ మహబూబ్‌బాషా సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు రాత్రి గంధోత్సవం, 20వ తేదీ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం కిస్తీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21వ తేదీ జియారత్ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు పోలకల్‌లో వైద్య శిబిరం

సి.బెళగల్: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగే వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కొత్తకోటలో వైఎస్సార్‌సీపీ ప్రచారం

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల ప్రచారం జరుగుతుందన్నారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్యదర్శిగా బాషా



సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్ఎం బాషా వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. ప్రస్తుతం ఈయన కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఉన్నారు.

సుంకులాపరమేశ్వరి హుండీ ఆదాయం రూ. 37.69 లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ నరసయ్య

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామదేవత సుంకులాపరమేశ్వరిదేవి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ. 37.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, ఈఓ నరసయ్య తెలిపారు. సోమవారం కర్నూలుకు చెందిన స్వచ్ఛంద సేవా సమితి మహిళా సభ్యులతో హుండీ కానుకలను లెక్కించారు. ఆరు నెలల కాలానికి ఈ ఆదాయం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. కాగా వారంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాంతిరామ్‌లో సిగ్మా 2కె24 ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్దనున్న శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సిగ్మా 2కె24 సింపోజియం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ కళాశాలల నుంచి 524 మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ఉన్నతికి ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరామ్, రమాదేవి, ఫరూక్, మహ్మద్, డెవిడ్ సుకీర్త తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- జగనన్నతోనే పేదలకు భరోసా
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

కర్నూలు సిటీ: రానున్న ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు, టీజీవీ నగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా జరిగిన మేలును వివరించారు. వారికి ఆయా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో తమ బతుకులు బాగుపడ్డాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. ప్రజల్లో జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు బ్యాచ్ కడుపు మంటతో రగిలిపోతోందన్నారు. 2014 ఎన్నికల్లో హామీలతో కూడిన మ్యానిఫెస్టో టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. కానీ జగనన్న ప్రతి సచివాలయం.. ప్రతి కార్యాలయంలో ఓపెన్‌గా మ్యానిఫెస్టో పెట్టారన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారని చెప్పారు. మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. చంద్రబాబుకు ఆ ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. పల్లెల్లో



దివ్యాంగుడిని ఓటు వేయాలని కోరుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

అనారోగ్యానికి గురైతే మందులకు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సేవలు అందించారన్నారు. మొన్నటిదాకా ఆర్థికంగా ఉన్నోళ్లకు మాత్రమే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పేదల దరిచేర్చిన జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు, విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఒక వైపు సంక్షేమం, మరో వైపు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో జిల్లాలో గతంలో కంటే 7 శాతం పేదరికం తగ్గిందని, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉండే నీతి ఆయోగ్ నివేదికలు ఇచ్చాయన్నారు. తెలుగుదేశం పార్టీ వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, వారి మాయ మాటలు నమ్మితే మోసపోతారన్నారు. ఎన్నికల్లో ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యులు హనుమంతు, రామ్‌నాథ్ రెడ్డి, శేఖర్, సర్పంచ్‌లు విద్యాసాగర్, శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, సింగిల్ విండో చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, వంశీధర్‌రెడ్డి, ప్రసాదు, మహేశ్వరరెడ్డి, పెరుగు భాస్కర్ రెడ్డి, బీచుపల్లి, పెరుగు హరినాథ్ రెడ్డి, అఖిలేష్ రెడ్డి, చిన్న లక్ష్మన్న, మోహన్‌బాబు, మహానందిరెడ్డి,అమర్నాథ్ రెడ్డి, ఉల్లాల విష్ణువర్ధన్ రెడ్డి, బోయ వెంకటేష్, పి.రుద్రవరం వెంకటేష్,బైరాపురం క్రిష్ణ, వెంకటేష్, గొందిపర్ల గోపాల్, ఆదాము, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి బుద్ధి చెప్పండి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవండి
- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అధికారం కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్న టీడీపీ కూటమికి మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తూ కరపత్రాలు అందజేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ నేరుగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పోటీ పడలేక చంద్రబాబు పొత్తులతో వస్తున్నారన్నారు. 2014లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకోలేదన్నారు. వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అలాంటి బాబు మళ్లీ ఇప్పుడు బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకుని వస్తున్నాడని గుణపాఠం చెప్పాలన్నారు.ఈసారి ఆయన ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు గల తేడాను గమనించాలన్నారు. గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు ఉండాలన్నారు. ఇప్పుడు నేరుగా అర్హుల ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. పారదర్శక పాలన కొనసాగాలంటే, పేదలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, ఇందుకు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాగ లక్ష్మీరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు భీమాశంకర్‌రెడ్డి, సుకుమార్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉమామహేశ్వరమ్మ

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీలో వలసల పరంపర కొనసాగుతోంది. సోమవారం ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సర్పంచ్ రామచంద్రుడు ఆధ్వర్యంలో గొల్ల శివుడు, శేఖర్, రామకృష్ణ, సుధాకర్ సహా పలువురు కాటసాని ఉమామహేశ్వరమ్మ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీలో బీసీలకు గుర్తింపు లేదని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, రామచంద్రుడు, మాజీ సర్పంచ్ నాగశేషులు, జీకే వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతివ్వండి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలోని గుట్టపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, సర్పంచ్ అయ్యస్వామి, ఎంపీటీసీ సభ్యుడు పుల్లయ్య, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, పెద్ద అయ్యపురెడ్డి, పెద్ద సుంకిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమం

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపిన బెస్తలు, మైనార్టీ నాయకులు



మైనార్టీలతో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

సి.బెళగల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బెస్తలు, మైనార్టీల సంక్షేమం సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయ కర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సి.బెళగల్‌లోని మార్మెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన బెస్త సంఘం సభ్యులు సుంకన్న, హుసేని, దుబ్బ రంగన్న, యంకన్న, మద్దిలేటి, ఎర్రన్న, తిరుపాల్ తదితరులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. బెస్త, మైనార్టీ సంఘం నాయకులతో ఆయన మాట్లాడుతూ.. బెస్తలు, ముస్లింలను టీడీపీ ఏనాడు పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలతో అన్ని విధాలుగా అండగా నిలిచారని తెలిపారు. వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని సంఘం నాయకులు తెలిపారు. సర్పంచ్ పాండురంగన్న, నాయకులు కటిక మక్బుల్, దుబ్బఖాజా, సోమశేఖర్‌రెడ్డి, నరసింహుడు, బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, పులిరాజు, రామకృష్ణ, ఎస్ఎం బాషా, సీబీ గోవింద రెడ్డి, ముల్ల హరున్, సీబీ తులసిరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

కల్లూరు: మండలంలోని పర్ల గ్రామానికి చెందిన 18 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తికి రాజీనామా పత్రాలను అందజేశారు. స్వచ్ఛందంగానే రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు హాజరుకావాలని కోరారు.

బడేసాబ్ ఉరుసు

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవులలో బడేసాబ్ తాత ఉరుసు సందర్భంగా సోమవారం గంధోత్సవం నిర్వహించారు. రాత్రి గ్రామంలో గంధం, స్వామివారి జెండాను ఊరేగించి మంగళవారం తెల్లవారుజామున దర్గాకు చేర్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సర్పంచ్ మాధవి తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య పనులు చేయించారు.

పంట మార్పిడితో మంచి ఫలితాలు



వర్కూరు ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: రైతులు వేసవి దుక్కులు చేసుకోవడంతో పాటు మట్టి పరీక్షలు చేయించుకోవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని ఏఓ రవిప్రకాష్ సూచించారు. సోమవారం మండలంలోని వర్కూరు రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. ఏటా ఒకే పంటను కాకుండా పంట మార్పిడి చేసుకోవాలని, పొలాలను వాలుకు అడ్డంగా దున్నడంతో పాటు, పంట అవశేషాలుంటే పొలాల గట్లపై వేసి కాల్చివేయాలని సూచించారు. ఆర్బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలను సకాలంలో అందించాలని ఆదేశించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా భారీ అగ్ని ప్రమాదాలను సైతం నివారించవచ్చని కోడుమూరు అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే భయపడకుండా బయటపడే మార్గాలను ఎంచుకుని ప్రాణాలు దక్కించుకోవాలన్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇస్తే సకాలంలో మంటలను అదుపు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటారన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించడంలో ఆశాలు కీలకం



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు మరణాలు తగ్గించడంలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం స్థానిక మహిళా ప్రాంగణంలో 6, 7 మాడ్యుల్స్‌పై నూతనంగా నియమితులైన ఆశాలకు 10 రోజుల శిక్షణ కార్యక్రమం మొదలైంది. ఈ సందర్భంగా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలయ్యేలా చూడాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనతపై, సరైన వివాహ వయస్సుపై అవగాహన కల్పించాలని సూచించారు. నవజాత శిశువుల గృహ సందర్శన చేసి కిట్లను ఉపయోగించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త వారి పరిధిలో ఉన్న గర్భిణీ, బాలింతలు, కౌమార బాలికలు ఎంత మంది ఉన్నారు, వారి ఆరోగ్యస్థితిగతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గర్భిణికి 01244588000 నంబర్ నుంచి వాయిస్ వస్తుందని, ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే ఐవీఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా మూడుసార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆ సందేశాలను వినాలనుకున్న ఎడల 14423 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి వినవచ్చన్నారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లోని గర్భిణులకు, బాలింతలకు అవగాహ న పెరుగుతుందని, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు సేవలు అందుతాయన్నారు. ఈ విషయంపై తమ పరిధిలోని గర్భిణులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమా, డీఎస్‌వో డాక్టర్ నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, ఎస్ఓ హేమసుందరం, మలేరియా అధికారి నూకరాజు, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి ఇందిర, డెమో ప్రమీలాదేవి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

గూడూరు: కుక్క అడ్డురావడంతో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా వాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడి ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గూడూరు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన ఆటో ప్రయాణికులతో కర్నూలు వెళ్తుండగా పెద్ద కాల్వ సమీపంలో కుక్కను తప్పించబోయి బోల్తాపడింది. గాయపడిన ఆరుగురిని 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతప్ప తెలిపారు.

నగరపాలకలో నామినేషన్ల సహాయ కేంద్రం



నామినేషన్ల సహాయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం నామినేషన్ల సహాయ కేంద్రం ప్రారంభించారు. అక్కడ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈనెల 18 వ తేదీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 25వ తేదీ మధ్యా హ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్న రాముడు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

అంధుల డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



అంధుల డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): అంధ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోకరంగా ఉంటుందని కలెక్టర్ సృజన అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదట కర్నూలు బీ క్యాంప్ క్వార్టర్స్‌లోని జాతీయ అంధుల సమాఖ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అంధుల డిజిటల్ లైబ్రరీని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాహిత్య పరమైన పుస్తకాలను డిజిటల్ లైబ్రరీలో ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన వారిలాగే జ్ఞానం పొందాలనే మంచి సంకల్పంతో ఈ లైబ్రరీని ఏర్పాటు చేశామన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి డిజిటల్ లైబ్రరీలో ఉపయోగిస్తున్న టెక్నాలజీ ద్వారా పుస్తకాలను ఆడియో రూపంలో విని చదువుకోవచ్చనే విషయం గురించి తెలుసుకోవడం ఇది మొదటి సారని కలెక్టర్ తెలిపారు. అలాగే మనం ఇతరులకంటే ఎందులోనూ తక్కువ కాదనే భావన అంధుల్లో కల్పించి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీలో భాగస్వామ్యులైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి లైబ్రరీలను ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సహకారాలు అందిస్తామన్నారు. దివ్యాంగులకు కొత్త సాఫ్ట్‌వేర్‌లు, వ్యవస్థలు ఏవైనా ఉంటే తెలుసుకొని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. డిజిటల్ లైబ్రరీకి అవసరమైన ఆరు కంప్యూటర్లను అందజేస్తామన్నారు.